జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 26 | సెప్టెంబర్ | 2026 • పేజీలు : 5



# ప్రత్యామ్నాయ రహదారి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**ములకలపల్లి, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** రాజుపేట సమీపంలో వంతెన కూలిపోవడంతో ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన కంపగూడెం క్రాస్ రోడ్ నుంచి ములకలపల్లికి ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ రహదారి పనులను పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని

మిగతా 2 లో...



- మణుగూరులో మినీ కేరళ స్పాట్...
- పర్యాటకులను రారమ్మంటున్న రథం గుట్ట జలపాతం..!
- వెండి తెరలా గుట్టపై నుంచి జారిపడుతున్న వర్షపు జలధారలు...
- స్వర్గాన్ని తలపిస్తున్న మణుగూరు రథం గుట్ట..!
- రథం గుట్ట సోషల్ మీడియాలో వైరల్.. జలపాతం చూడ్డానికి జనాల క్యూ..!
- ఒక్క వర్షంతో మారిపోయిన మణుగూరు రూపురేఖలు...
- రథం గుట్టపై నుంచి భూమిని ముద్దాడుతున్న జలపాతాలు..!

# జాలువారుతున్న జలపాతం

2 లో..

భద్రాద్రి మణుగూరులో ప్రకృతి అద్భుతం ఆవిష్కృతమైంది. కుండపోతగా కురుస్తున్న వర్షాలకు రథం గుట్ట సరికొత్త రూపు సంతరించుకుంది. గుట్టపై నుంచి జాలువారుతున్న వర్షపు జలధారలు తాత్కాలిక జలపాతాలుగా మారి భూమిని ముద్దాడుతున్నాయి. గుట్ట అంచుల నుంచి వెండి తెరలా కిందికి జారుతున్న నీటి ప్రవాహాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. చుట్టూ పచ్చని చెట్లు, మధ్యలో జలధారల హోరు, పైన కమ్ముకున్న మేఘాలు..చూస్తే స్వర్గాన్ని తలపిస్తోంది. వర్షపు చినుకులతో రథం గుట్ట అందం రెట్టింపు అయింది. ఈ అద్భుత దృశ్యాన్ని కళ్లారా వీక్షించేందుకు స్థానికులు, ప్రకృతి ప్రేమికులు గుట్ట వద్దకు చేరుకుంటున్నారు. మణుగూరులో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ గా మారింది.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు, ప్రజాజ్యోతి

# అర్నాబ్ తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం



- అధైర్య పడకండి బాధితులకు త్వరలోనే నష్టపరిహారం
- ఎమ్మెల్యే కూనం నేని భరోసా

**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ/ సెప్టెంబర్ 25,(ప్రజా జ్యోతి)** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను బీభత్సానికి తీవ్రంగా దెబ్బతిన్న మండల పరిధిలోని దంతాలబోరే ఎస్ కాలనీ గ్రామాన్ని స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అర్నాబ్ తుఫాను సృష్టించిన నష్టాన్ని, గ్రామంలో కూలిపోయిన ఇళ్లను అయిన పరిశీలించారు. సర్వస్వం కోల్పోయిన బాధితులను కలిసి వారిని ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని అధైర్యపడవద్దని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమకు జరిగిన ఆస్తి నష్టం, విద్యుత్ లేక పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని వెంటనే గ్రామంలో నిలిచిపోయిన విద్యుత్‌ను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు దెబ్బతిన్న పేదలకు ప్రభుత్వ నియమావళి ప్రకారం నష్టపరిహారం అందేలా త్వరగా నివేదికలు తయారు చేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు, ఎమ్మెల్యే వెంట

మిగతా 2 లో...

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలంలో సర్వేను పరిశీలించిన కలెక్టర్

- -సర్వే నంబర్ 549/1లో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం



**ఇల్లందు, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి)** ఇల్లందు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన సర్వే నంబర్ 549/1లోని స్థలంలో చేపడుతున్న సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలానికి సంబంధించి కొంతమంది రైతులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, కోర్టు ఆదేశాల మేరకు చేపడుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే నంబర్ 549/1లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం 20 ఎకరాల స్థలాన్ని ప్రతిపాదించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ రికార్డులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ వివరాలు, పాత నక్షాలు,

మిగతా 2 లో...

# దుగినేపల్లి పంచాయతీలో 'బిల్లులు' మాయం...పని ఎక్కడో చెప్పగలరా?..

- దుగినేపల్లి పంచాయతీలో నిధుల వినియోగంపై తీవ్ర అనుమానాలు..
- విచారణకు గ్రామస్థుల డిమాండ్




**పినపాక, సెప్టెంబర్ 25(ప్రజాజ్యోతి):** గ్రామ అభివృద్ధి కోసం కేటాయించిన పంచాయతీ నిధుల వినియోగంపై దుగునేపల్లిలో తీవ్ర చర్చ జరుగుతోంది. పంచాయతీ రికార్డుల్లో వివిధ పనులు, సామగ్రి కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు నమోదై ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆయా పనులు ఎక్కడ జరిగాయి? ప్రజలకు వాటి ప్రయోజనం ఎక్కడ కనిపిస్తోంది? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. పంచాయతీ ఆన్‌లైన్ రికార్డుల్లో పలు పనులకు సంబంధించిన బిల్లులు, చెల్లింపులు నమోదై ఉన్నట్లు తెలుస్తోంది. అయితే స్థానికుల ఆరోపణ ప్రకారం, రికార్డుల్లో

మిగతా 2 లో...

## అర్నాబ్ తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం





(మొదటి పేజీ తరువాయి...)

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, తహసిల్దార్ దారా ప్రసాద్ ఎం.పి.డి.ఓ.రాజారావు , ఎలక్ట్రికల్ డి ఈ , ఏఈ లు అగ్రికల్చరల్ ఏవో, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, నారాయణపేట సర్పంచ్ సరస్వతి, నాయకులు కోలేటి రాంబాబు, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, సిహెచ్ శ్రీను, సాయిలి ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, జకరయ్య, అమీర్, మోహన్, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ రహదారి పనులు వేగవంతం చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. మండల కేంద్రానికి చెందిన అయిత లలితకు సీఎంఆర్ ఎఫ్ కింద మంజూరైన చెక్కును ఆమె స్వగృహంలో అందజేశారు. రాజుపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న జర్పుల రాములమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందేలా తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.డి. జహీర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి, జిల్లా ఉపాధ్యక్షులు తాండ్ర ప్రభాకర రావు, పాలకుర్తి రత్నభూషణం, కౌలూరి ప్రసాద్, నాయకులు కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, మడకం చిరుమప్ప, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాలువారుతున్న జలపాతం...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. సెప్టెంబర్ 25, ప్రజాజ్యోతి :** భద్రాద్రిలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో రథం గుట్ట జలమయమైంది. గుట్టపై నిలిచిన వర్షపు నీరంతా ఒక్కసారిగా కిందికి దూకుతోంది. దీంతో గుట్టపై అక్కడక్కడా 4 నుంచి 5 చోట్ల చిన్నపాటి జలపాతాలు ఏర్పడ్డాయి. ఎత్తు నుంచి దూకే నీరు రాళ్లను తాకుతూ చేస్తున్న శబ్దం ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తోంది. పచ్చదనంతో కప్పబడిన గుట్ట, దానిపై నుంచి జాలువారుతున్న తెల్లని నురగల జలధారలు చూస్తే.. భద్రాద్రి జిల్లాలోనే మరో అందమైన ప్రదేశం ఆవిష్కృతమైనట్లు అనిపిస్తోంది. వర్షం తగ్గగానే చిన్నపిల్లలు, యువకులు గుట్ట వద్దకు చేరుకుని జలపాతం కింద స్నానాలు చేస్తూ సందడి చేస్తున్నారు. పలువురు తమ ఫోన్లలో ఈ అందాలను బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు.



**మణుగూరులో మినీ కేరళ..పర్యాటకులను రారమ్మంటున్న రథం గుట్ట జలపాతం..!**

మణుగూరులో ప్రకృతి అందాలు పర్యాటకుల ను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రథం గుట్ట మినీ కేరళను తలపిస్తోంది. గుట్టపై నుంచి జాలువారుతున్న జలపాతం చూసేందుకు ఇద్దరు ముగ్గురు అన్న తేడా లేకుండా జనం క్యూ కడుతున్నారు. పచ్చని కొండలు, వాటి మధ్య నుంచి దూకే తెల్లని జలధారలు కేరళ లోని అందాలను గుర్తుకు తెస్తున్నాయని పర్యాటకులు చెబుతున్నారు. ఇంతకాలం బొగ్గు గనులకే పరిమితమైన మణుగూరు, ఇప్పుడు ఈ జలపాతంతో కొత్త టూరిస్ట్ స్పాట్ గా మారుతోంది. వీకెండ్ రాగానే కుటుంబ సమేతంగా వచ్చి ఈ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. ఈ అందాలను శాశ్వత టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**వెండి తెరలా గుట్టపై నుంచి జారిపడుతున్న వర్షపు జలధారలు..స్వర్గాన్ని తలపిస్తున్న మణుగూరు..!**

రథం గుట్టపై ప్రకృతి తన అందాలన్నీ ఒలకబోసింది. వర్షపు నీటి ప్రవాహం గుట్టపై నుంచి వెండి తెరలా జారిపడుతూ కనువిందు చేస్తోంది. ఎత్తు నుంచి కిందికి దూకే ప్రతి జలధార స్వచ్ఛమైన వెండి దారంలా మెరుస్తోంది. ఆ నీరు రాళ్లపై పడి తుంపర్లుగా మారి చుట్టూ చిరుజల్లులు కురిపిస్తుండటం చూడటానికి అద్భుతంగా ఉంది. పైన నల్లని మేఘాలు, కింద పచ్చని భూమి, మధ్యలో ఈ తెల్లని జలపాతం.. మొత్తం ప్రాంతం స్వర్గాన్ని తలపిస్తోందని చూసిన ప్రతి ఒక్కరూ అంటున్నారు. ప్రకృతి ప్రేమికులకు ఈ దృశ్యం కనుల పండుగగా మారింది, ఈ అపురూప దృశ్యాన్ని చూసేందుకు జనం ఎగబడుతున్నారు.

**రథం గుట్ట సోషల్ మీడియాలో వైరల్.. జలపాతం చూడ్డానికి జనాల క్యూ..!**

మణుగూరు రథం గుట్ట జలపాతం వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. వర్షపు నీటితో ఏర్పడిన తాత్కాలిక జలపాతం దృశ్యాలను స్థానిక యువకులు వీడియో తీసి ఇన్‌స్టా, వాట్సాప్‌లో పెట్టడంతో క్షణాల్లో వైరల్ అయ్యాయి. వీడియో చూసిన జనం జలపాతం ఎక్కడా అంటూ ఆరా తీస్తున్నారు. వైరల్ కావడంతో నిన్నటి నుంచి రథం గుట్ట వద్దకు జనాల తాకిడి పెరిగింది. బైకులు, ఆటోల్లో కుటుంబాలతో సహా వచ్చి జలపాతం ముందు ఫోటోలు, రీల్స్ చేసుకుంటున్నారు. ఒక్క వీడియోతో మారుమూల ఉన్న రథం గుట్ట ఒక్కసారిగా ఫేమస్ అయిపోయింది. వర్షం ఉన్నంత వరకే ఈ అందాలు ఉంటాయని, చూడాలనుకునే వారు త్వరగా రావాలని స్థానికులు చెప్పుకుంటున్నారు.

**ఒక్క వర్షంతో మారిపోయిన మణుగూరు రూపురేఖలు..రథం గుట్టపై నుంచి భూమిని ముద్దాడుతున్న జలపాతాలు..!**

ఒక్క వర్షం మణుగూరు రూపురేఖలనే మార్చేసింది. మొన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న రథం గుట్ట, నేడు జలపాతాల గుట్టగా మారిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి గుట్టపై ఉన్న నీరంతా పొంగి పొర్లుతోంది. గుట్ట అంచుల నుంచి భూమిని ముద్దాడుతున్నట్లుగా జలధారలు కిందికి జారుతున్న దృశ్యం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఎండకు ఎండిపోయిన రాళ్ల మధ్య నుంచి ఇంత పెద్ద మొత్తంలో నీరు రావడం ప్రకృతి వింతగా స్థానికులు చెప్పుకుంటున్నారు. అందుకే ఉన్నన్ని రోజులూ ఈ అందాన్ని ఆస్వాదించాలని ప్రజలు గుట్ట వైపు పరుగులు తీస్తున్నారు.

## దుగినేపల్లి పంచాయతీలో 'బిల్లులు' మాయం...పని ఎక్కడో చెప్పగలరా?..

(మొదటి పేజీ తరువాయి...)


Towards Payment Of Dozer #38 Jcb Bill
మొత్తం ₹ 77,900
Komaram Sudhakar
**********2789
IFSC
*******1301
XVFC/2026-27/P/12 [30/May/2026]
Sandeep Raj Akula [3 mons 23 days ago]
Gundapu Kiran Kumar [3 mons 23 days ago]
3 mons 23 days ago
3 mons 23 days ago
PFMS
(3 mons 21 days ago)

కనిపిస్తున్న పనులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు కనిపించడం లేదని వారు చెబుతున్నారు.ప్రజాధనం ఖర్చు చేసినప్పుడు పనులు జరిగిన ప్రదేశం, పని పరిమాణం, వర్క్ ఆర్డర్లు, బిల్లులు, వౌచర్లు, సామగ్రి కొనుగోలు వివరాలు, స్టాక్ రిజిస్టర్ వంటి రికార్డులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ ఈ అంశాలపై స్పష్టత లేకపోవడంతో పంచాయతీ నిధుల వినియోగంపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

బిల్లులు ఉన్నాయి.. పని కనిపించదే?

ప్రజల ప్రశ్న ఒక్కటే— "ప్రభుత్వ నిధులతో పని జరిగితే ఆ పని ఎక్కడ ఉంది?" రికార్డుల్లో చెల్లింపులు నమోదై ఉంటే, వాటికి సంబంధించిన పనులను అధికారులు క్షేత్రస్థాయిలో చూపించాల్సిన అవసరం ఉంది.

పని చేయకుండా బిల్లులు సృష్టించారా?

పని పూర్తిగా జరగకముందే చెల్లింపులు జరిగాయా?

కొనుగోలు చేసినట్లు చూపిన సామగ్రి వాస్తవంగా పంచాయతీకి చేరిందా?

అన్న ప్రశ్నలకు అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

ప్రజాధనం.. లెక్క చెప్పాల్సిందే

పంచాయతీ నిధులు ప్రజల పన్నులు, ప్రభుత్వ నిధులతో సమకూరుతాయి. కాబట్టి ప్రతి రూపాయి ఖర్చుకు పారదర్శకమైన లెక్క ఉండాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన బిల్లులను ఆధారంగా చేసుకుని సంబంధిత పనులను అధికారులు స్వయంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎంపీడీఓ, పంచాయతీరాజ్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పనులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. "రికార్డుల్లో బిల్లులు ఉంటే.. నేలపై పని కూడా కనిపించాలి. పని లేకపోతే బిల్లులు ఎందుకు?" అనే ప్రశ్న ప్రస్తుతం దుగునేపల్లి గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలంలో సర్వేను పరిశీలించిన కలెక్టర్



(మొదటి పేజీ తరువాయి...)

పాస్‌బుక్‌లు, భూభారతి రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. స్థలానికి సంబంధించిన పాత రికార్డులు, సర్వే వివరాలు, నక్షాలు, ఇతర పత్రాలను సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చాలని అధికారులను ఆదేశించారు. సర్వే సందర్భంగా అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. అనంతరం కొంతమంది రైతులు తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్‌లు, భూ సంబంధిత పత్రాలను కలెక్టర్‌కు చూపించారు. తాము గతంలో సదరు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ వచ్చామని, తమ భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని కోరారు. పాఠశాల నిర్మాణానికి భూమి అవసరమైతే నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు సమర్పించిన పత్రాలు, సంబంధిత అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించిన కలెక్టర్, సర్వే నంబర్ 549/1లో అన్ని శాఖల సమక్షంలో సర్వేను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, రికార్డుల ఆధారంగా వాస్తవ సరిహద్దులను నిర్ధారిస్తూ సమగ్ర నివేదికను సమర్పించాలని రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు ఇల్లందు తహసిల్దార్ షా ఖాసిం, ఏడి సర్వే శ్రీనివాస్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ యు సందీప్, ఎంపీడీఓ దన్ సింగ్, సంబంధిత శాఖల అధికారులు, సర్వేయర్లు రైతులు పాల్గొన్నారు.

# గిరిజన మ్యూజియం కళాఖండాలు అద్భుతం

- విద్యార్థులకు గిరిజన సంస్కృతిపై అవగాహన
- ఐటీసీ పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిటుకుల ప్రశాంత్



**భద్రాచలం, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి):** ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసిన కళాఖండాలు అద్భుతంగా ఉన్నాయని ఐటీసీ భద్రాచలం పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిటుకుల ప్రశాంత్ అన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పాతకాలపు వస్తువులను మ్యూజియంలో పొందుపరచడం ద్వారా నేటి తరం విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. శుక్రవారం ఐటీసీ పబ్లిక్ స్కూల్, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది విహారయాత్రలో భాగంగా ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన గిరిజనుల కళాఖండాలు, వేషధారణ, పనిముట్లు, సంస్కృతి, సంప్రదాయాలను వారు ఆసక్తిగా తిలకించారు. కళాఖండాలకు సంబంధించిన చరిత్ర, వివరాలను తెలుగులో ప్రదర్శించడం విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉందని ప్రశాంత్ పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా మ్యూజియం సందర్శనకు అవకాశం కల్పించాలని కోరారు. గిరిజన సంస్కృతి, భాష పరిరక్షణకు ఐటీడీఏ పీవో బి. రాహుల్ చేస్తున్న కృషికి కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శిరీష రాజా, ఉపాధ్యాయినీలు రాజీబా, వల్లి మంజరి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలకు కూలిన పూరిగుడిసె



**చర్ల, సెప్టెంబర్ 25(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు లింగాల గ్రామానికి చెందిన కవ్వాల శ్రీకాంత్‌కు చెందిన పూరిగుడిసె నేలకూలిపోయింది. దీంతో కుటుంబం ఉండేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వర్షాల కారణంగా ఇల్లు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేస్తోంది. అధికారులు స్పందించి నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నీట మునిగిన మిరప చేలు





**చర్ల, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి తీర ప్రాంతంలోని మొగళ్లపల్లి, చింతకుంట, జీపీపల్లి, వీరాపురం గ్రామాల్లో మిరప పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వ్యవసాయ పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప సాగు కోసం ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు నీటమునగడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పొలాల్లో నిలిచిన నీటిని ఇంజన్ల సహాయంతో బయటకు పంపేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. అయితే వరద నీరు ఎక్కువ రోజులు పొలాల్లో నిల్వ ఉంటే మిరప మొక్కలు కుళ్లిపోయి చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా వర్షాలు మరికొన్ని రోజులు కొనసాగితే లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు మరింతగా ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులు స్పందించి ముంపు ప్రాంతాలను పరిశీలించి, పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## పాల్వంచ 41వ డివిజన్ బాపూజీ నగర్ లో 5 వేల మందికి అన్నదానం



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబర్ 25 ,(ప్రజా జ్యోతి)** గణేష్ నవరాత్రుల ముగింపు అనంతరం పాల్వంచ పట్టణ పరిధిలోని 41వ డివిజన్‌లో కార్పొరేటర్ గొర్లె అన్నపూర్ణ , గొర్లె నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం బాపూజీనగర్ కాపు సంఘం, వినాయక యూత్ సభ్యుల సహకారంతో భారీ ఎత్తున అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాపు సంఘం పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్వంచ పట్టణ ఎస్ఐ నాగరాజు, చాలా శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.వారు మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహా గొప్పది అని అన్నారు, ఉత్సవాలు నిర్వహించడం తోపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విశేషం అన్నారు, అన్నదాన కార్యక్రమానికిసుమారు 5 వేల నుంచి 6 వేల మంది భక్తులు పాల్గొన్నారు. అన్న ప్రసాదం కార్యక్రమానికి విచ్చేచిన భక్తులు అందరుకి కార్పొరేటర్ గొర్లె అన్నపూర్ణ , నరేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు

- 26 నుంచి 28 వరకు దరఖాస్తుల స్వీకరణ
- భద్రాచలం ఐటిడిఏ పిఓ బి రాహుల్



**భద్రాచలం, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి):** 2026-27 విద్యా సంవత్సరానికి ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో మైక్రోబయాలజీ విభాగంలో మహిళలకు రెండు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 శాతం మార్కులతో పాటు నెట్, సెట్ లేదా పీహెచ్‌డీలో ఏదైనా అర్హత కలిగి ఉండాలి. అర్హత గల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాల నకళ్లతో ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి 28న సాయంత్రం 5 గంటల వరకు భద్రాచలంలోని ఐటీడీఏ గురుకులం ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలి. అభ్యర్థుల విద్యార్హత మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆర్‌సీవో అరుణకుమారి తెలిపారు. వివరాలకు 9949723291 సంప్రదించాలని సూచించారు.

## అండర్-16 స్టేట్ ప్రాబబుల్స్‌కు ఐదుగురు ఎంపిక

- చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి మరో ఘనత
- హెచ్‌సీఏ రాష్ట్ర జట్టులో చోటే లక్ష్యం



**భద్రాచలం, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-16 స్టేట్ ప్రాబబుల్స్‌కు భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుంచి ఐదుగురు యువ క్రికెటర్లు ఎంపికయ్యారు. జూపల్లి దిరాజ్, ప్రసన్న కుమార్, ఉజ్వల్ గణేష్, దీపక్ నాయక్, సాయి చంద్ర ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు. రేపటి నుంచి నిర్వహించనున్న ప్రాబబుల్స్ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచి హెచ్‌సీఏ అండర్-16 రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా వీరు బరిలోకి దిగనున్నారు. కోచ్ శరత్ తేజ మార్గదర్శకత్వంలో సాధన చేస్తున్న ఐదుగురు క్రీడాకారుల ఎంపిక పట్ల అకాడమీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి జట్టులో చోటు సంపాదించేలా క్రీడాకారులు ప్రతిభ కనబరచాలని అకాడమీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.51 వేలకు వినాయక లడ్డూ సొంతం చేసుకున్న చల్లకోటి పూర్ణ

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని తాళ్ళగొమ్మూరు మహాలక్ష్మమ్మ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా సాగింది. ఈ వేలం పాటలో కాలనీ ప్రజలు పోటాపోటీగా పాల్గొనగా..చల్లకోటి పూర్ణచంద్రరావు ఉత్సాహంగా పాల్గొని రూ.51 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో పోటీ ఉత్కంఠగా సాగగా, చివరకు చల్లకోటి పూర్ణచంద్రరావు రూ.51,000కు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను అభినందించారు. శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆశీస్సులు పూర్ణచంద్రరావు, ఆయన కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



## సీనియర్ జర్నలిస్ట్ కొత్త కు కాళోజీ సాహితీ పురస్కారం






**ఇల్లందు, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)** పత్రికా రంగంలో సుమారుగా 40 ఏళ్లుగా జర్నలిస్ట్ గా కొనసాగుతున్న ఇల్లందు సీనియర్ జర్నలిస్ట్ కొత్త వెంకటేశ్వర్లు ను జాతీయ స్వచ్ఛంద సంస్థ తెలుగు వెలుగు సాహితీ వేదిక కాళోజీ సాహితీ పురస్కారం అవార్డును శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 27న వరంగల్ లో జరగనున్న తెలుగు బాషా సాహితీ సాంస్కృతిక ఉత్సవాల్లో కొత్త వెంకటేశ్వర్లు (కెవి) కి ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు.

# భద్రాచలంలో 3వ అదనపు కోర్టు మంజూరు

- బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనందోత్సవాలు



**భద్రాచలం, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** భద్రాచలంలో నూతనంగా 3వ కోర్టుగా జూనియర్ సివిల్ జడ్జి–కమ్–అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టును మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీఓఎంఎస్ నం.59 పట్ల భద్రాచలం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో స్వీట్స్ పంపిణీ చేసి వారు సంబరాలను జరుపుకున్నారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలు, గిరిజనుల న్యాయ అవసరాలను పరిగణనలోకి తీసుకుని నూతన కోర్టు మంజూరుకు సహకరించిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌లకు బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. అలాగే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావుకు ధన్యవాదాలు తెలిపింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ నాయకత్వంలో జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి, కార్యవర్గ సభ్యులు చేసిన నిరంతర కృషి ఫలితంగానే ఈ కోర్టు మంజూరైందని పేర్కొంది. భద్రాచలంలో జిల్లా అదనపు కోర్టు సాధనకు ఇది తొలి అడుగుగా అభివర్ణిస్తూ, న్యాయవాదుల ఐక్యతతో భవిష్యత్తులో జిల్లా అదనపు కోర్టును కూడా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

# తాలిపేరుకు వరద ఉధృతి

- 15 గేట్లు ఎత్తివేత,53,992 క్యూసెక్కుల నీరు విడుదల



**చర్ల, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ప్రాజెక్టు 15 గేట్లను ఎత్తివేశారు. ఇందులో 10 గేట్లను పూర్తిగా (ఫ్రీ ఫ్లో), 5 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం 53,992 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి కూడా 53,992 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 20 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, క్రెస్ట్ లెవల్ 69.00 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం నీటిమట్టం 72.15 మీటర్లుగా నమోదైంది. ప్రాజెక్టు మొత్తం నిల్వ సామర్థ్యం 730 మిలియన్ క్యూబిక్ అడుగులు (ఎంసీఎఫ్‌టీ) కాగా, ప్రస్తుతం 424.945 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# రూ. 75,516కు లడ్డు కైవసం

**ఇల్లందు, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)** జెకె కాలనీ అయ్యప్ప దేవాలయం లైన్‌లో శ్రీ సిద్ది వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం రాత్రి జరిగిన లడ్డు వేలం పాటలో ముక్తి శంకర్ – పావని దంపతులు రూ. 75,516 లకు కైవసం చేసుకున్నారు. 11 రోజులు నిత్యం పూజలు అందుకున్న లడ్డును వేలం పాటలో దక్కించుకోవడం సంతోషకరమని ముక్తి శంకర్ – పావని దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ది వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన శోభాయాత్రల్లో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

- శోభాయాత్రల్లో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్న కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / సెప్టెంబర్ 25, (ప్రజా జ్యోతి)** గణేష్ నిమజ్జనం సందర్భంగా పాల్వంచ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన శోభాయాత్రల్లో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు నృత్యాలు చేసి, పలువురిని ఆకట్టుకున్నారు. శుక్రవారం బిసిఎం రోడ్డులోని పాల్వంచ కా మహరాజ్ కమిటీ నాయకులు బేతంశెట్టి వెంకట్, బేతంశెట్టి విజయ్ సోదరులు, సంతోష్ రెడ్డి (బబ్లూ)ల ఆధ్వర్యంలో పాతపాల్వంచ ఆర్.టి. కాలనీ నిర్వాహకులు ఫోటో బాబీల ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో కొత్వాలతో పాటు ఆయన సతీమణి పాతపాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి నృత్యాలు చేసి పలువురిని అలరించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గణేషున్ని పూజించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. గణేషుని దీవెనలు సకల మానవాళికి ఎంతో స్పూర్తిదాయకం అని కొత్వాల అన్నారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో పాటు చింతా నాగరాజు, చిన్న పండు, మస్తాన్, సాగర్, బోగిని శ్రీను, బోగిని సందీప్, ఫోటో బాబి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ



**ఇల్లందు, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)** ఇల్లందు కోర్టులోనీ న్యాయవాదులకు శుక్రవారం ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నిరంతరం వృత్తిపరమైన ఒత్తిడిలో ఉండే న్యాయవాదులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అత్యవసర వైద్య సమయాల్లో ఈ హెల్త్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వల్లభనేని అరుణ, జనరల్ సెక్రటరీ షేక్ మొహమ్మద్ ఖాసిం, ట్రెజరర్ సపావట్ బన్సీలాల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు చెన్నకేశవరావు, సుడిగాలి వెంకట నరసయ్య, పప్పుల గోపీనాథ్, దంతాల ఆనంద్, పి కరుణాకర్, ఐలయ్య, బాలకృష్ణ, పెద్దూరి వెంకట నరసయ్య, మామిడి సత్యప్రకాష్, టి మహేశ్వరరావు, పైలా జయప్రకాష్, పొన్నం అనిల్ కుమార్, సూర్ణపాక సత్యనారాయణ, కీర్తి కార్తిక్, ఉమామహేశ్వరరావు, బోడ వినయ్, అజ్మీర రమేష్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు బీటలు.. పొంచి ఉన్న ప్రమాదం

- అడుగడుగునా గుంతలు.. అధ్వానంగా మారిన సీసీ రోడ్డు
- అధిక లోడుతో వాహనాలరాకపోకలతో రహదారి దెబ్బతిన్నదని స్థానికుల ఆరోపణ
- ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి





**సుజాతనగర్ సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి)** :–కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సుజాతనగర్ డివిజన్ ఆఫీస్ సమీపంలో సీసీ రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. అధిక లోడుతో వాహనాల రాకపోకల కారణంగా రోడ్డుకు పగుళ్లు ఏర్పడి, కొంత భాగం విరిగిపోయింది. రహదారి మధ్యలోనే ఈ గుంతలు ఏర్పడటంతో, వేగంగా వచ్చే వాహనదారులు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వా హనదారులు ఈ గుంతల వల్ల అదుపు తప్పి కిందపడిపోయే అవకాశం ఉన్నది రో డ్డు పరిస్థితిని అధికారులు వెంటనే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టా లని స్థానికులు కోరుతున్నారు. అలాగే అధిక లోడుతో రాకపోకలు సాగించే వా హనాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్ర మాదం చోటుచేసుకోక ముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# అద్దె బకాయిలతో ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం

- 15 నెలలుగా అద్దె చెల్లింపులు లేక భవన యజమాని చర్య



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి):** సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ కాంట్రాక్టు కార్మికులు,వారి కుటుంబ సభ్యులకు వైద్యసేవలు అందిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రికి అద్దె బకాయిల వ్యవహారం కారణంగా శుక్రవారం తాళం పడింది. సుమారు 15 నెలలుగా భవనానికి అద్దె చెల్లించకపోవడంతో యజమాని ఆస్పత్రికి తాళం వేసినట్లు తెలిసింది.దీంతో వైద్యం, మందుల కోసం ఆస్పత్రికి వచ్చిన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కొంతసేపు బయటే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.రోజువారీ వైద్యసేవల కోసం వచ్చే కార్మికులు,వారి కుటుంబ సభ్యులకు ఆస్పత్రి మూసివేయడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.మందులు తీసుకునేందుకు, వైద్యులను సంప్రదించేందుకు వచ్చిన పలువురు రోగులు ఆస్పత్రి తలుపులు మూసి ఉండటంతో అయోమయానికి గురయ్యారు. విషయం ఆస్పత్రి వైద్యుడు చందు దృష్టికి రావడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

### ›› అధికారుల జోక్యంతో తొలగిన తాళం

ఆస్పత్రికి తాళం వేసిన విషయం తెలుసుకున్న వైద్యుడు చందు ఈ విషయాన్ని వరంగల్‌లోని ఈఎస్ఐ జాయింట్ డైరెక్టర్ హేమలతకు తెలియజేశారు. స్పందించిన జాయింట్ డైరెక్టర్ భవన యజమానితో మాట్లాడి, గత ఏడాది జూలై నుంచి ఉన్న అద్దె బకాయిలను త్వరలో చెల్లిస్తామని, ఇందుకు సంబంధించిన చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోందని హామీ ఇచ్చినట్లు తెలిసింది.అధికారుల హామీతో కార్మికుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకున్న భవన యజమాని తాళం తొలగించారు.దీంతో కొంతసేపటి అనంతరం ఆస్పత్రిలో వైద్యసేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాళం వ్యవహారంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, అధికారులు జోక్యం చేసుకోవడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది.

### ›› ప్రభుత్వ భవనంలోకి తరలింపు ఎప్పుడు?

ఈఎస్ఐ ఆస్పత్రులను అద్దె భవనాల నుంచి ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని ఉన్నతాధికారులు సూచించినప్పటికీ సారపాకలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు ఖాళీగా లేకపోవడంతో ఆస్పత్రిని అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.అయితే అద్దె చెల్లింపులు సకాలంలో జరగకపోవడంతో ఇలాంటి పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు నిరంతరాయంగా వైద్యసేవలు అందేలా అద్దె బకాయిల సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, వీలైనంత త్వరగా ప్రభుత్వ భవనాన్ని కేటాయించి ఈఎస్ఐ ఆస్పత్రిని తరలించాలని పలువురు కోరుతున్నారు.

# ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన దంతెలబోర ఎస్సీ కాలనీని ఆదుకుంటాం







- **మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు సహాయం అందేలా చేస్తాం**
- **తుఫాన్ ప్రభావంతో కూలిన ఇళ్లను పరిశీలించిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**

**పాల్వంచ, సెప్టెంబర్ 25, ప్రజాజ్యోతి:** ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన దంతెలబోర ఎస్సీ కాలనీ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులను ఆదుకునేలా చర్యలు చేపడతామని పాల్వంచ సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.తుఫాన్ కారణంగా ఇళ్లు కూలిపోయి తీవ్రంగా నష్టపోయిన పాల్వంచ మండల పరిధిలోని దంతెలబోర ఎస్సీ కాలనీని శుక్రవారం కొత్వాల శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పూర్తిగా కూలిపోయిన 6 ఇళ్లు, పాక్షికంగా దెబ్బతిన్న 36 ఇళ్లను ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి నష్ట వివరాలను తెలుసుకు న్నారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులతో తక్షణ సహాయక చర్యలపై చర్చించారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

### »» దెబ్బతిన్న బెండతోట పరిశీలన

తుఫాన్ ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న బెండతోటను, విరిగిన చెట్లను వ్యవసాయ శాఖ అధికారి శంభోశంకర్‌తో కలిసి కొత్వాల పరిశీలించారు. పంట నష్టం, రైతులకు కలిగిన ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా దంతెలబోర ఎస్సీ కాలనీలో జరిగిన నష్టం తీవ్రంగా ఉందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందేలా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్తామని తెలిపారు. ఇళ్లు కూలిపోయిన కుటుంబాలకు పునరావాసం, పంట నష్టపోయిన రైతులకు తగిన సహాయం అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాలె జానకిరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్నగౌడ్, సర్పంచ్ కందుల వెంకటరమణ, కార్యదర్శి అరుణ, గ్రామస్తులు బర్ల లక్ష్మీదేవి, పొందు రమణ, శనగా బాయమ్మ, బర్ల వెంకటేశ్వర్లు, కందుల ప్రశాంత్, బర్ల బుచ్చమ్మ, కాటూరి రమేష్, తులసీరామ్, కారుమంచి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

- **రైతు హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి: అన్నవరపు సత్యనారాయణ**




**ములకలపల్లి, సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి)** నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మహాసభల విజయాన్ని కోరుతూ శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి పంటకు స్వామినాథన్ సిఫారసుల మేరకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటర్ కెనాల్ కాలువలను వెంటనే నిర్మించి జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. పామాయిల్ రైతులకు నాణ్యమైన మొక్కలు, గెలలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ ఎరువుల బుకింగ్ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో రైతులకు ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. యూరియా కొరతను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు, దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మీనరసయ్య, భూక్యా శ్రీదేవి, గౌరీ నాగేశ్వరరావు, మాలోతు రావూజ, నిమ్మల మధు, రవీందర్, శ్రీరాములు, రాఘవయ్య, శనగాని వినోద్, తేజావత్ జగ్గు, హేమని పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న తాటి

**ములకలపల్లి సెప్టెంబర్ 25 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో లోకల్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కమిటీ సభ్యులు తాటిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాదెగోని వెంకటేష్‌గౌడ్, సాయిల శ్రీనివాస్, బొంతు నందు, పొట్లపల్లి హరీష్, ప్రసాద్‌శాస్త్రి, దినేష్‌రెడ్డి, అజిత్ తదితరులు పాల్గొన్నారు.



## సమయస్ఫూర్తి చాటిన దమ్మపేట పోలీసులు

- **ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు!**





**దమ్మపేట (సెప్టెంబర్ 25) ప్రజా జ్యోతి:** మండల పరిధిలో నిన్న కురిసిన కుండపోత వర్షాలు, ఈదురుగాలుల ధాటికి రహదారులపై రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగింది. మందలపల్లి గ్రామం నుంచి అశ్వారాపేట వెళ్లే ప్రధాన రహదారిపై, మందలపల్లి ఊరి చివర వర్ష తీవ్రతకు భారీ వృక్షాలు వేళ్లతో సహా విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఉన్నపళంగా రోడ్డుపై చెట్లు కూలిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు మరియు అత్యవసర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రహదారి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో గమ్యస్థానాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఉద్యోగులు మరియు వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ధమ్మపేట పోలీస్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీస్ సిబ్బంది తక్షణమే ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వర్షం తగ్గుముఖం పట్టగానే చెట్లను తొలగించేందుకు అవసరమైన పరికరాలతో శ్రమించి, విరిగిపడిన భారీ కొమ్మలను, చెట్లను కట్ చేసి రోడ్డుకు ఇరువైపులా పక్కకు తొలగించారు. పోలీస్ సిబ్బంది స్వయంగా రంగంలోకి దిగి అనతి కాలంలోనే రహదారిని క్లియర్ చేయడంతో ట్రాఫిక్ సమస్య త్వరితగతిన సర్దుమణిగింది. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.విపత్తు సమయంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించిన ధమ్మపేట పోలీసుల చొరవను, కార్యదీక్షను మందలపల్లి గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు, ప్రయాణికులు ముక్తకంఠంతో కొనియాడారు. పోలీసు సిబ్బంది చూపిన సమయస్ఫూర్తికి స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జన వేడుకలు

- **మదర్ తెరిసా కమిటీ, యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదానం**





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 25, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మదర్ తెరిసా కమిటీ, యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా భక్తులు కోలాటాలతో సందడి చేయగా, యూత్ డీజే పాటలతో ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు గణనాథుని నామస్మరణ చేస్తూ ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులో ముందుకు సాగారు. మదర్ తెరిసా కమిటీ, యూత్ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని ఇతర గణనాథుల నిమజ్జనాలు కూడా ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య వైభవంగా ముగిసింది.